క్లుప్తంగా

కరకట్టపై ప్రమాదకరంగా మారిన గుంతలు



ఉత్తరచిరువోలులంక(మోపిదేవి): మండల పరిధిలోని ఉత్తర చిరువోలులంక నుంచి అయోధ్య వెళ్లే కృష్ణా కరకట్టపై ఏర్పడిన గుంతలు ప్రమాదకరంగా మారాయి. కొంతకాలం క్రితం వాటర్ పైప్ వేయడానికి తవ్విన గుంతలు అలాగే వదిలివేయడంతో ఇటీవల వచ్చిన భారీ వర్షాలకు అవి పెద్ద పెద్ద గుంతలుగా ఏర్పడ్డాయి. ఈ గుంతలపై గడ్డి పెరగడంతో అక్కడ గుంతలు ఉన్నాయని తెలియడం లేదు. దీంతో ఈ కరకట్టపై ప్రయాణించే ఆటో, ద్విచక్ర వాహనదారులకు రాత్రి సమయాల్లో అవి ప్రమాదకరంగా పరిణమిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి త్వరితగతిన గుంతలు పూడ్చించి ప్రమాదాలను అరికట్టాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రమాదకరంగా చెన్నూరు రహదారి

కమలాపురం వద్ద రెండు వైపులా కోతకు గురైన రోడ్డు



పెడన: మండల పరిధిలోని చెన్నూరుకు వెళ్లే ప్రధాన రహదారి కమలాపురం వంతెన వద్ద కోతకు గురైంది. రోడ్డుకు ఇరువైపులా కోతకు గురవడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని గ్రామస్తులతో పాటు వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు ప్రమాదకరంగా ఉందని గ్రామస్తులు సూచిక రాళ్లను ఏర్పాటు చేశారు. నిత్యం అటుగా చెన్నూరు, సింగరాయపాలెం సుబ్రమణ్యేశ్వర స్వామి ఆలయానికి, కై కలూరు, కలిదిండి, ముదినేపల్లి వైపునకు వెళ్లే వారంతా ఈ మార్గం నుంచే వెళ్తుంటారు. తక్షణం మరమ్మతులు చేయించకపోతే పెద్ద ప్రమాదం జరిగే అవకాశాలున్నాయని, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి రోడ్డు మరమ్మతులు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పారిశుద్ధ్య పనులు ముమ్మరం



కొక్కిలిగడ్డ(మోపిదేవి): అంటువ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు వేగవంతం చేశారు. మండలంలోని వరద ప్రభావిత ప్రాంతాలైన కొక్కిలిగడ్డ, కె.కొత్తపాలెం సర్పంచ్‌లు దిడ్ల జానకీ రాంబాబు, కొక్కిలిగడ్డ మాధవి ఆధ్వర్యంలో ఆయా గ్రామాల్లో డ్రెయినేజీలు తవ్వించారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయించారు. మండల కో ఆప్షన్ సభ్యులు చందన రంగారావు, గ్రామ కార్యదర్శులు రవి, పంచాయతీ, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంజినీర్లే జాతి నిర్మాతలు



మచిలీపట్నంటౌన్: జాతి నిర్మాతలు ఇంజినీర్లేనని ప్రముఖ ఇంజినీర్ ఆర్‌వీఎస్ మురళీధర్ అన్నారు. ఇంజినీర్స్ డేను పురస్కరించుకుని భారతీయ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో స్థానిక బాలాజీ విద్యాలయంలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మురళీధర్ మాట్లాడుతూ ప్రముఖ ఇంజినీర్, దివంగత మోక్షగుండం విశ్వేశ్వరయ్య ఆలోచనలు అందరికీ ఆదర్శమన్నారు. వ్యాసరచనలో ప్రతిభ కనబరిచిన కె.శ్రీవల్లీ, కె. రూపసాయి లిప్సిక, కె.వినమ్ర, వక్తృత్వ పోటీలో ప్రతిభ కనబరిచిన కె.లహరి, జె.హేమ ఆశ్రీ, జి.జ్ఞాపికలకు నగదు బహుమతులను ఇరిగేషన్ ఏఈ సత్యనారాయణ అందజేశారు. తొలుత విశ్వేశ్వరయ్య చిత్రపటానికి మురళీధర్, భారతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు కారుమూరి రాజేంద్రప్రసాద్, కార్యదర్శి ముదిగొండ శాస్త్రి, ఈశ్వరమ్మ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్ ఏర్పాటు

మచిలీపట్నంటౌన్: స్థానిక రాబర్ట్‌సన్‌పేట పోలీస్‌స్టేషన్‌కు విద్యుత్‌శాఖ ఈఈ ఎం.భాస్కరరావు ఆధ్వర్యంలో శనివారం విద్యుత్ స్మార్ట్ మీటరును బిగించారు. ప్రప్రథమంగా నగరంలోని పోలీస్‌స్టేషన్‌కు ఈ విద్యుత్ స్మార్ట్ మీటరు బిగించారు. రాష్ట్ర ప్రభుత్వం డిజిటల్ మీటర్లను తొలగించి వాటి స్థానంలో స్మార్ట్ మీటర్లు బిగించేందుకు చర్యలు వేగవంతం చేయటంతో తొలిసారిగా మీటరును పోలీస్ స్టేషన్‌కు బిగించారు.

విఘ్నాలు తొలగించయ్యా..



కలెక్టరేట్ వద్ద గణనాథునికి పూజలు




భావదేవరపల్లి నుంచి నిమజ్జనానికి..



పెడన మండలం పెనుమల్లిలో..

వినాయక నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా పలు ప్రాంతాల్లోని పందిళ్లలో కొలువుదీరిన గణనాథులను శనివారం భక్తులు దర్శించుకున్నారు. విఘ్నాలను తొలగించాలని పూజలు చేశారు. పలు అలంకారాలలో దర్శనమిచ్చిన స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. పలు గ్రామాల్లో నిమజ్జనోత్సవాలను కూడా ఉల్లాసంగా ఉత్సాహంగా నిర్వహిస్తున్నారు.

– మచిలీపట్నంటౌన్/పెడన/నాగాయలంక/మోపిదేవి/బంటుమిల్లి/ఘంటసాల



మచిలీపట్నం బైపాస్‌రోడ్డులో..



ఘంటసాల మండలం కొడాలిలో



గూడూరు ఆటో స్టాండ్ వద్ద ..



పెడన 15వ వార్డులో..



పెడన17వ వార్డులో ..



వడ్లగరువు చవితి పందిరి వద్ద..



జానకీరామపురం గణనాథుని గ్రామోత్సవం..



మచిలీపట్నంటౌన్‌లో హోమాలు



మేళ్లమర్తిలంకలో అన్నదానం..

లోక్ అదాలత్‌లో కేసుల సత్వర పరిష్కారం



లోక్‌అదాలత్ ద్వారా కేసులు పరిష్కరిస్తున్న న్యాయమూర్తి బాబునాయక్



బంటుమిల్లి కోర్టులో లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న న్యాయమూర్తి భాస్కరరావు

అవనిగడ్డ: స్థానిక కోర్టు ఆవరణలో శనివారం నిర్వహించిన మెగా లోక్‌అదాలత్‌లో 245 కేసులు పరిష్కరించినట్టు సీనియర్ సివిల్ జడ్జి బాబు నాయక్ తెలిపారు. ఈ మెగా లోక్‌అదాలత్‌లో మొత్తం 245 కేసులకు సంబంధించి రూ.16.04 లక్షలు సెటిల్‌మెంట్ చేసినట్టు న్యాయమూర్తి బాబునాయక్ తెలిపారు. రాజీపడతగిన కేసుల్లో కక్షిదారులు కోర్టుల చుట్టూ తిరగడం వల్ల డబ్బు, సమయం వృథా అవుతుందన్నారు. లోక్‌అదాలత్ ద్వారా రాజీపడితే ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయన్నారు. న్యాయమూర్తి రాజన్ ఉదయ్‌ప్రకాష్, అదాలత్ సభ్యులు కొండవీటి ఈశ్వరరావు, సీనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.

బంటుమిల్లి: స్థానిక జూనియర్ సివిల్ కోర్టు ఆవరణలో శనివారం మండల న్యాయ సేవాధికార కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 97 కేసులు పరిష్కారం అయినట్లు కోర్టు ప్రతినిధులు తెలిపారు. కమిటీ చైర్మన్ ఎం.భాస్కరరావు పర్యవేక్షణలో అదాలత్‌లో క్రిమినల్ కేసులు 20, ఎక్సైజ్ తదితర 77 కేసులు, రాజీ చేసుకోతగ్గ కేసులను రాజీ చేసి పలు కేసుల్లో జరిమానా విధించి పరిష్కారం చేశారు. తొలుత న్యాయమూర్తి భాస్కరరావు మాట్లాడుతూ లోక్‌అదాలత్ ద్వారా కేసుల పరిష్కారంలో కక్షిదారులకు సమయం, ఆర్థిక స్వావలంబన లభిస్తుందన్నారు. కక్షిదారులు కూడా పట్టుదలకు పోకుండా రాజీ చేసుకోదగ్గ కేసులను పెద్దల సమక్షములోగానీ,న్యాయవాదుల ద్వారా పరిష్క రించుకోవాలన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు యాళ్ల శ్యాంబాబు, సీనియర్ న్యాయవాదులు పీవీ వెంకటేశ్వరరావు, టి.సురేష్, పి.పవన్‌కుమార్, బి.సురేష్, మోజస్, రవి తదితరులు పాల్గొన్నారు.

పాడి పరిశ్రమ లాభసాటి



పశువైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్

పెడన: లాభాసాటిగా పాడి పరిశ్రమ నిలుస్తోందని, రైతులు పాడి పశువుల ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకుని పశువైద్యశిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సీనియర్ కౌన్సిలర్ కటకం ప్రసాద్ అన్నారు. శనివారం పెడన పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువుల ఆసుపత్రి వద్ద పశువైద్య శిబిరం నిర్వహించారు. అసిస్టెంట్ డైరెక్టర్ కొనకళ్ల బాబూరావు వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిబిరంలో 74 పాడి పశువులకు వివిధ రకాల చికిత్సలను అందించామన్నారు. ఈ శిబిరంలో వైద్యులు అల్తాఫ్ హుస్సేన్, వెటర్నరీ అసిస్టెంట్ రాజేశ్వరరావు, సచివాలయ ఉద్యోగులు, పాడి రైతులు పాల్గొన్నారు.

వరద బాధితులకు రూ.5 లక్షల విరాళం



ఎమ్మెల్యే బుద్ధప్రసాద్‌కు విరాళాన్ని అందిస్తున్న ప్రిన్సిపాల్ భీమారావు

చల్లపల్లి(అవనిగడ్డ): వరద బాధితుల సహాయార్థం కృష్ణా జిల్లా చల్లపల్లి విజయా హైస్కూల్ తరపున రూ.5 లక్షల విరాళాన్ని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌కు అందించారు. శనివారం స్థానిక స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో ఈ మొత్తం విరాళాన్ని ప్రిన్సిపాల్ నాగళ్ల భీమారావు ఎమ్మెల్యేకు అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వరద బాధితుల సహాయార్థం విజయా అకాడమీ పెద్ద ఎత్తున విరాళాన్ని అందించి అగ్రగామిగా నిలిచిందన్నారు. సంస్థ చైర్మన్ గొర్రెపాటి రంగనాథబాబు, ఎంపీపీ కోట విజయరాధిక, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ గొర్రెపాటి వెంకట రామకృష్ణతో పాటు ట్రస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పులిగడ్డ(అవనిగడ్డ): స్థానిక పంచాయతీ పరిధిలోని వసుమట్ల ఎస్సీ కాలనీకి చెందిన వరద బాధితులకు గ్రామానికి చెంది ఛత్తీస్‌ఘడ్‌లో స్థిరపడిన గోసార రాజు రూ.75 వేల విలువైన నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. శనివారం జరిగిన ఈ కార్యక్రమంలో నిత్యావసర సరుకులను జనసేన నియోజకవర్గ నాయకులు మండలి వెంకట్రామ్ (రాజా) చేతుల మీదుగా పంపిణీ చేశారు. సర్పంచ్ దాసరి విజయకుమార్, ఉప సర్పంచ్ మండలి వెంకటేశ్వరరావు, వైఎస్ ఎంపీపీ పులిగడ్డ పిచ్చేశ్వరరావు, మండలి దినేష్, మండలి శేషు, సుధీర్ పాల్గొన్నారు.

బొబ్బర్లంక(మోపిదేవి): మండలంలోని బొబ్బర్లంకలో వరద బాధితులకు తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా, తానా పౌండేషన్ ఆధ్వర్యంలో నిత్యావసర సరుకులు, టవల్స్ అందజేశారు. గ్రామంలో 200 కుటుంబాలకు గాను ఒక్కొక్క కుటుంబానికి ఐదు కిలోల బియ్యం, ఒక కిలో కందిపప్పు, కిలో గోధుమ పిండి, కిలో ఆయిల్ ప్యాకెట్, కిలో సాల్ట్, అరకిలో పుట్నాలపప్పు, అరకిలో వేరుశనగ గుళ్లు, 100 గ్రాముల సాంబారు పౌడర్, 100 గ్రాముల పసుపు, 100 గ్రాముల కారం, ఒక కండువా చొప్పున నిత్యావసర సరుకులను బాధితులకు అందజేశారు. కృష్ణానది వరద ప్రభావిత ప్రాంతాల్లో తానా పౌండేషన్ ఆధ్వర్యంలో ఆరు వేల మంది బాధితులకు ఈ సహాయం అందజేసినట్లు పౌండేషన్ చైర్మన్ వల్లభనేని శశికాంత్ తెలిపారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ తనయుడు యువనేత మండలి వెంకట్రామ్, గ్రామ సర్పంచ్ దొప్పలపూడి గంగాభవాని, జగదీష్, సంస్థ ప్రతినిధి బీవీరావు, వేమూరి వెంకట్రావ్, స్వచ్ఛంద కార్యకర్తలు శశికళ, సోనీబాబు, సుకన్య, దివ్య, రాము పాల్గొన్నారు.

ఘనంగా హిందీ భాషా దినోత్సవం




హిందీ భాష కవులు, రచయితల వేషధారణలతో కొమ్మారెడ్డి విద్యార్థులు



హిందీ పరీక్ష పోటీల్లో పొందిన బహుమతులతో సెయింట్ జాన్స్ పాఠశాల విద్యార్థులు

బంటుమిల్లి: స్థానిక కొమ్మారెడ్డి ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాల, సెయింట్ జాన్స్ ఇంగ్లిష్ మీడియం ఉన్నత పాఠశాలల్లో శనివారం హిందీ భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పాఠశాలల డైరెక్టర్లు కె.కిషోర్, సాబూజాన్‌లు మాట్లాడుతూ 1949 నుంచి హిందీ రాజ భాషగా ప్రాముఖ్యతను సంతరించుకుందన్నారు. ప్రపంచంలో అత్యధిక మందికి హిందీ భాష మాతృభాషగా ఉన్నందున ప్రతి ఒక్కరూ హిందీ నేర్చుకోవలసి ఉందని చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థులు హిందీ కవులు, రచయితలు, ప్రముఖ నాయకుల వేష ధారణలతో అలరించారు. హిందీ భాషలో పలు పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు ఎస్.శ్రీనివాసరావు, ఝాన్సీసాబూ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మిలాద్ ఉన్ నబీ వేడుకల్లో పాల్గొనండి



సమావేశంలో పాల్గొన్న ముస్లిం ప్రముఖులు

ముస్లిం ప్రముఖుల పిలుపు

మచిలీపట్నంటౌన్: ఈ నెల 16న సోమవారం నగరంలో జరిగే మిలాద్ ఉన్ నబీ వేడుకల్లో ముస్లింలు పెద్ద ఎత్తున పాల్గొనాలని ముస్లిం ప్రముఖులు పిలుపునిచ్చారు. ఈ మేరకు రాజుపేట షాదీఖానాలో మిలాద్ ఉన్ నబీ నూతన కమిటీ కార్యవర్గ సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సోమవారం జామియా మసీదులో ఉదయం 11 గంటలకు అన్నదాన కార్యక్రమం ప్రారంభమవుతుందని, ముస్లింలు హాజరుకావాలన్నారు. రాత్రి 7 గంటలకు స్థానిక కోనేరుసెంటరులో ముంబై, పలు రాష్ట్రాలకు చెందిన మత గురువులు ప్రవక్త జీవిత విశేషాలపై ప్రసంగాలు చేస్తారన్నారు. నాలుగు గంటలకు నగరంలో శాంతి పాదయాత్ర ఉంటుందన్నారు. ముస్లింలందరూ ఈ శాంతి యాత్రలో పాల్గొనాలని కోరారు. డీజేలతో శబ్దాలు చేయకుండా బైక్, సైకిళ్లను పక్కన పెట్టి కాలి నడకన శాంతియాత్రలో పాల్గొనాలని కోరారు. మిలాద్ ఉన్ నబీ రోజున ఖర్చుపెట్టిన ప్రతి రూపాయికి పుణ్యఫలం దక్కుతుందని వారన్నారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ సుభాన్, జామియా మసీదు అధ్యక్షుడు ఎండీ అంజత్ పాషా, సభ్యులు ఎండీ రబ్బానీ, రహమత్‌బాషా, ఎస్‌కే బాజానీ, షానవాజ్, షేక్ అమీర్, మౌలాలి, జహంగీర్, అబ్దుల్ వాజిద్, ఎండీ యాసిన్, బర్కతుల్లా, అబ్దుల్ ఖదీర్, ఎండీ నిజాం పాల్గొన్నారు.

నులిపురుగుల నివారణ మాత్రల పంపిణీ



గూడూరు: నులిపురుగుల నివారణే లక్ష్యంగా ప్రభుత్వం నులిపురుగుల నివారణ మందులు పంపణీ చేస్తోందని ఎంఈఓ-1 బీఎస్‌సీ శేఖర్‌సింగ్ అన్నారు. ఈ నెల 17న జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలోని పలు పాఠశాలల హెచ్‌ఎంలకు నులిపురుగుల నివారణ మందులను శనివారం పంపిణీ చేశారు. మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు పర్యవేక్షించాలని ఎంఈఓ కోరారు. ఎంఈఓ-2 పి.సుబ్రహ్మణ్యం, మల్లవోలు పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



కృత్తివెన్ను: మండలంలోని సీతనపల్లి సమీపంలో 216 జాతీయ రహదారిపై శనివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. ఎస్‌ఐ పైడిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పల్లెపాలెంకు చెందిన టి.కిషోర్‌కుమార్, పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మండలం నాగేంద్రపురానికి చెందిన విజయబాబు బైక్‌పై కృత్తివెన్ను వైపునకు వస్తున్నారు. విజయవాడ నుంచి భీమవరం వైపునకు వెళుతున్న కారు, బైక్ సీతనపల్లి పెట్రోల్ బంకు సమీపంలో ఎదురెదురు ఢీ కొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్రగాయాలు కాగా వారిని భీమవరం హాస్పిటల్‌కు తరలించారు. వీరిలో కిషోర్‌కుమార్‌ను మెరుగైన వైద్య చికిత్స కోసం విజయవాడ మణిపాల్‌కు తరలించినట్లు సమాచారం. ఈ ఘటనలో కారు ముందు భాగం ధ్వంసం కాగా, బైక్ రెండు ముక్కలై పూర్తిగా ధ్వంసమైంది. ఈ ప్రమాద సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

మద్యం అక్రమంగా తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్



నాగాయలంక: ఇంటివద్ద అమ్మేందుకు మద్యం బాటిళ్లను తీసుకెళుతున్న వ్యక్తిని పట్టుకున్నట్టు ఎస్‌ఐ కలిదిండి రాజేష్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం మండలంలోని గుల్లలమోద గ్రామానికి చెందిన కొప్పనాతి బాలరాజు అక్రమంగా మద్యం అధిక ధరలకు అమ్ముతుంటాడు. ఇందుకోసం శనివారం మద్యం తరలిస్తుండగా విశ్వసనీయ సమాచారం రావడంతో సిబ్బందితో కలిసి వెళ్లి నాగాయలంకలో పట్టుకున్నామని తెలిపారు. అతని నుంచి 25 క్వార్టర్ల మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఎలాంటి లైసెన్స్ లేకుండా మద్యం బాటిల్స్ కలిగి ఉన్నందున మధ్యవర్తుల సమక్షంలో విచారించామన్నారు. గ్రామంలో చట్ట విరుద్ధంగా మద్యం అమ్ముతున్నట్లు అంగీకరించగా స్టేషన్‌కు తీసుకువచ్చి కేసు నమోదు చేసామని ఎస్‌ఐ వివరించారు.

రేపటి నుంచి పవిత్రోత్సవాలు

మచిలీపట్నంటౌన్: స్థానిక రాబర్ట్‌సన్‌పేటలో శ్రీ రంగనాయకస్వామి పవిత్రోత్సవాలు ఈ నెల 16వ తేదీ నుంచి 19వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కందుల వేణుగోపాలరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పవిత్రోత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ స్వామివారికి పలు పూజా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

ఘనంగా పవిత్రోత్సవాలు



శ్రీకాకుళం(ఘంటసాల): మండలంలోని శ్రీకాకుళం గ్రామంలో ఆంధ్ర మహావిష్ణువు శ్రీకాకుళేశ్వర స్వామి దేవస్థానం అష్టమ వార్షిక పవిత్రోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా అగ్నిహోత్రం భాస్కరాచార్యులు పర్యవేక్షణలో ముత్తేవి వెంకట సత్యనారాయణాచార్యులు సారథ్యంలో శ్రీకాకుళేశ్వర స్వామి వారికి పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా శ్రీకాకుళేశ్వర స్వామి దేవస్థానం చుట్టూ అగ్ని ప్రతిష్టాపనతో ప్రదక్షిణలు చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆయా కార్యక్రమాలను ఆలయ సహాయ కమిషనర్ ఎన్.సూర్యచక్రధరరావు ఆధ్వర్యంలో సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

ఉత్సాహంగా గ్రాండ్ పేరెంట్స్ డే



మచిలీపట్నం టౌన్: స్థానిక సుకర్లాబాద్‌లోని నెల్లూరు రవీంద్ర భారతి స్కూల్‌లో శనివారం గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలు ఉత్సాహంగా నిర్వహించారు. ఈ వేడుకలకు అమ్మమ్మ, నాయనమ్మలు, తాతలు పాల్గొనగా వారి కాళ్లకు చిన్నారులు నమస్కరించి వారి ఆశీర్వచనం పొందారు. ఈ సందర్భంగా చిన్నారులతో జీవితంలోని పలు అనుభవాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.